క్లుప్తంగా

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

నగరి: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో శుక్రవారం నుంచి రోజువారీగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తామని, వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతాయని ఆర్డీఓ భవానీశంకరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు అందరూ ఈ సదస్సుల్లో పాల్గొనాలన్నారు. రెవెన్యూ, రీ సర్వేకు సంబంధించిన సమస్యలపై షెడ్యూలు ప్రకారం ఆయా గ్రామాలకు చెందినవారు అర్జీలు ఇవ్వవచ్చునన్నారు. తహసీల్దార్‌లు, సర్వేయర్లు, గ్రామ అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిశీలిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం మండలంలోని మాంగాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తొలి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

విజయపురం: పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ రజినికుమార్ అన్నారు. బూచివానత్తం పంచాయతీలో గురువారం ఈ–క్రాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంట బీమా అందాలన్నా పంటల నమోదు తప్పనిసరి అన్నారు. బూచివానత్తం పంచాయతీలో 50 మంది రైతులు ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్నారని, మిగిలిన అన్ని పంచాయతీలకు చెందిన రైతులు నమోదు చేసుకోవాలని కోరారు. సాగు చేసిన పంటలలో సస్య రక్షణ చర్యలు పాటించాలన్నా రు. పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, వీఏఏ పవిత్ర, ప్రియ, మీనా, రైతులు పాల్గొన్నారు.


పిల్లల సంరక్షణ అందరి బాధ్యత

పుత్తూరు: మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల సంరక్షణా విద్య అందరి బాధ్యత అని ఇన్‌చార్జి సీడీపీఓ సంధ్య పేర్కొన్నారు. గురువారం పుత్తూరు మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎర్లీ చైల్డ్‌కేర్–ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంధ్య మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల ప్రతిభను వివరించారు. ప్రీస్కూల్ పిల్లలందరికీ నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను ఆకర్షించేలా బొమ్మల చార్టులు, పిల్లలు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, సూపర్‌వైజర్స్ గీతాంజలి, అనిత, టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

వడమాలపేట(విజయపురం): భూసార పరీక్షలు చేసుకోవడంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చునని తిరుపతి భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అప్పలాయగుంటలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలతో ప్రయోజనాలు రైతులకు వివరించారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడితే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. తిరుపతి, వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలో ఈ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య మాట్లాడుతూ నేల ఆరోగ్యంతోనే రైతుకు సౌభాగ్యమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, భూసార పరీక్ష కేంద్రం ఏఓ రామాంజనేయరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జాహ్నవి, గ్రామ సర్పంచ్ శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం కొండపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ముఖద్వారం, మెట్లు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. పావులూరు కండ్రిగ గ్రామస్తులు సొంత ఖర్చులతో స్వామి వారి ఆలయ మెట్లు, ముఖద్వారం(ఆర్చి) నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు.

తహసీల్దార్‌కు వ్యతిరేకంగా దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు, బాధితులు

వెదురుకుప్పం: తహసీల్దార్ రమేష్‌బాబుకు వ్యతిరేకంగా గురువారం వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో నాయకులు, బాధితులు కలిసి నిరాహారదీక్ష చేశారు. సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ తహసీల్దార్ రమేష్‌బాబు రైతులపై చూపిస్తున్న వైఖరి రాజరికాన్ని తలపిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎలాంటి స్పందన లేకపోవడంతో పాటు బాధితులతో ఒక మాట జిల్లా అధికారుల వద్ద మరో రకంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తున్న తహసీల్దార్ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్‌తో చర్చలు సాగాయి.

కోడి.. కాపాడుకోండి!

- శీతాకాలంలో పౌల్ట్రీలో జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదం


కోళ్ల ఫారంలో పది రోజుల కోడి పిల్లలు


లక్ష్మీనరసింహపురంలో కోళ్లఫారం

పాలసముద్రం: శీతాకాలం వచ్చేసింది. చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. ఈ సమయంలో కోళ్లు తీవ్ర ఒత్తిడికి గురై తెగుళ్లబారిన పడే ప్రమాదముంది. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పౌల్ట్రీ పరిశ్రమపై ఆధారపడి చాలామంది రైతులు జీవిస్తున్నారు. వారు శీతాకాలంలో కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలబారిన పడక తప్పదు. వీరికి పశుసంవర్ధక శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

కోళ్లపై శ్రద్ధ పెట్టాలి

కోళ్ల షెడ్డులోకి అపరిచిత వ్యక్తులు, వాహనాలు అనుమతించరాదు. ఫార్మాలిన్ ద్రావకంతో సిబ్బంది కాళ్లు, వాహనాల టైర్లు శుభ్రపరిచిన తరువాత మాత్రమే అనుమతించాలి. తాజానీరు, దాణా మాత్రమే కోళ్లకు అందించాలి. తేమ శాతం అధికంగా ఉండి నిల్వ ఉన్న దాణాలో శిలీంద్రాలు పెరిగే అవకాశం ఉన్నందున మిగిలిపోయిన దాణాను పారవేసి తాజా దాణాను ఇవ్వాలి.

వ్యాధుల నియంత్రణ

- ఫారం కోళ్లతో దేశీయ కోళ్లు(నాటు కోళ్లు), వలస పక్షులు కలవకూడదు.
- ఫారం ప్రాంగణంలో నీటి నిలువ ఉండకుండా చూడాలి.
- కోళ్లఫారాల్లో ఒకే వయస్సున్న పిల్లలను పెంచాలి.
- కోళ్లఫారాల్లో తిరిగే వ్యక్తులు గమ్‌బూట్లు, గ్లౌజులు, ముఖానికి మాస్కులు తదితర దుస్తులు వాడాలి.
- ఒక ఫారం నుంచి మరో ఫారానికి వ్యక్తులు వెళ్లరాదు.
- కోళ్లఫారంలోకి వెళ్లేటప్పుడు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. క్రిమి సంహారక మందులు ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి. ఇంకో ఫారంలోకి మూడు రోజుల వరకు వెళ్లకూడదు.
- ఫారాల్లో ఉండే నీరు, దాణా, సామగ్రి తదితరాలను శుభ్రంగా కడిగి, 15 రోజులకోసారి క్రిమి సంహారక మందులతో శుభ్రం చేస్తుండాలి.
- వేరే కోళ్లఫారాల నుంచి వస్తు సామగ్రిని తీసుకోరాదు
- కోళ్ల ఫారం ప్రాంగణం అంతా కంచె వేయాలి.
- కోడి గుడ్లకు డిస్పోజబుల్ అట్టలను వాడాలి.
- మిశ్రమ జాతులు అనగా బాతులు, కోళ్లు, పందులు మొదలైన ఫారాలు పెట్టరాదు.
- కోళ్ల దాణా ప్రతీ బ్యాచ్‌ను పరీక్ష చేసిన అనంతరమే వాడాలి. పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలి.
- పౌల్ట్రీ ప్రాంగణానికి ఆరడుగుల దూరంలో ఏ విధమైన చెత్తాచెదారం, కుళ్లిన పదార్థాలు ఉండరాదు.
- ఫారంలో ఏమైనా అకాల మరణాలు సంభవిస్తే సంబంధిత పశువైద్యాధికారికి తెలియజేయాలి.
- నిర్ణీత కాలంలో టీకాలు వేయించి, పోషక విలువలు ఉన్న దాణాను ఇవ్వాలి. యాజమాన్య పద్ధతులు పాటించాలి.

జాగ్రత్తలు

- గదిలో ఇన్‌ఫ్రారెడ్ దీపాలు ఏర్పాటు చేయడం ద్వారా గది ఉష్ణోగ్రతను తగినంత స్థాయిలో ఉంచవచ్చు.
- షెడ్డులో అధిక సమయం విద్యుత్ దీపాలతో తగినంత కృత్రిమ వెలుతురు ఇవ్వాలి.
- చలికాలం గదిలో తేమ అధికంగా ఉండడంతో శిలీంద్రాలు ఎక్కువగా పెరుగుతాయి. కొన్ని రకాల శిలీంద్రాలతో యాస్పర్‌గిల్లోసిస్ అనే ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి కలిగే ప్రమాదం ఉంది. ఈ వ్యాధితో కోడిపిల్లల్లో అధిక మరణాలు కలుగుతాయి. పెద్ద కోళ్లు గిడస బారి ఉత్పత్తి సామర్థ్యం కోల్పోతాయి.
- కొరైజా, సీఆర్‌డీ (క్రానిక్ రెస్పిరేటరీ డిసీజ్)ఇతర ముఖ్యమైన ఊపిరితిత్తి సంబంధిత వ్యాధులు. అధిక మేత, అపరిశుభ్ర వాతావరణాల్లో ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతుంది.
- అధిక ఒత్తిడికి గురైనా వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఈ కోలి, సాల్మనెల్లోసిస్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కోళ్లు అధికంగా పారతాయి. గుడ్ల ఉత్పత్తి పడిపోతుంది.
- శీతాకాలంలో వ్యాధులను నిరోధించేందుకు పశువు వైద్య నిపుణుల సూచనల మేరకు తగిన సమయంలో తగిన మోతాదులో టీకాలు తప్పనిసరిగా వేయించాలి.

ఉష్ణోగ్రత కీలకం



కోళ్ల షెడ్లలోని ఉష్ణోగ్రత కోళ్ల ఉత్పత్తి మెరుగ్గా ఉండడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉష్ణోగ్రత.తేమ శాతం. ముఖ్యంగా రాత్రి వేళల్లో నిర్దిష్ట ప్రమాణాల ప్రకారం ఉంచడం ద్వారా మాత్రమే అధిక ఉత్పత్తి సాధించవచ్చు. అందుకోసం సాయంత్రం, రాత్రి వేళల్లో షెడ్లలో తెరలు ఏర్పాటు చేసి. చలిగాలి చొరబడకుండా చూడాలి. కోళ్ల ఫారం చుట్టూ చెట్లు ఎత్తుగా పెంచితే షెడ్లలోకి చల్లగాలి రాదు. – ప్రభాకర్, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


రోడ్డు భద్రత నియమాలను వివరిస్తున్న ఏఎస్‌ఐ

పాలసముద్రం: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని ఏఎస్‌ఐ మునస్వామి తెలిపారు. గురువారం చిత్తూరు–బలిజకండ్రిగ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనదారులతో ఏఎస్‌ఐ మునస్వామి మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యం స్థానాలు చేరుకోవాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగకుండా వాహనాలు నడపాలని సూచించారు. ముఖ్యంగా వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక ఉండాలన్నారు. రికార్డులేని వాహనాలకు ఆన్‌లైన్‌లో జరిమానా వేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

గంగాధరనెల్లూరు: మండలంలోని మూత రంగనపల్లి గ్రామానికి చెందిన గజేంద్ర మండడి నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అఖిలభారత యాదవ మహాసభ చిత్తూరు యాదవ సంఘం నేతలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి పిల్లల భవిష్యత్తు కోసం 61 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరి కుటుంబాన్ని భారతీయ యాదవ మహాసభ సంఘం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ సంఘ చిత్తూరు నేతలు నవీన్ యాదవ్, శ్రీధర్ యాదవ్, కృష్ణ యాదవ్, మణి యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతిపై నిరసన

నగరి: అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడి ద్యార్థులు దాడి చేసిన సంఘటనలో ఆయన మృతి చెందడంపై ఫ్యాప్టో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయిలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆర్డీఓ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన ఉపాధ్యాయ కుటుంబానికి ఫ్యాప్టో అండగా ఉంటుందన్నారు. బయట వ్యక్తులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై దాడి చేసిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. దోషులను శిక్షించాలని, ఉపాధ్యాయుడి కుటుంబానికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్ మునిరత్నం, జి.లక్ష్మీనారాయణ, జనార్ధన్, నాగభూషణం, సంతోష్ కుమార్, ఎస్ మహేంద్ర, సి.మోహన్, సుబ్రహ్మణ్యం, వెంకటేశులు, కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

విజయపురం: ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడి చేయడం దారుణమని ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. రాయచోటిలో ఉపాధ్యాయుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం తహశీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పాఠశాల పరిసర ప్రాంతాల్లో గుట్కా, గంజాయి, మద్యం విక్రయించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.మణిగండన్, కె.వంశీకృష్ణ, పురషోత్తం, రూబన్, రవి, జనార్ధన్, బాబు, మణి, సురేష్, నారాయణస్వామి, హరిప్రసాద్, తిరుమలేశ్‌రెడ్డి, హరికృష్ణ, కులశేఖర్ పాల్గొన్నారు.

నేడు పన్నూరులో రెవెన్యూ సదస్సు

విజయపురం: మండలంలోని పన్నూరులో శుక్రవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కిరణ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సదస్సు ఉంటుందని, భూ సంబంధిత సమస్యలు ఉంటే అర్జీ ఇస్తే 45 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పుత్తూరులో..

పుత్తూరు: మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23 వరకు జరిగే ఈ సదస్సుల్లో అన్ని భూ వివాదాలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అర్జీలు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రికార్డుల్లో మార్పులకై తే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 6వ తేదీన తడుకు రెవెన్యూ పంచాయతీలో, 7న కళింకుప్పం, శిరుగురాజుపాళెం, 9న తొరూరు, 10న నేసనూరు, 11న గోవిందపాళెం, వీరప్పరెడ్డిపాళెం, 12న నందిమంగళం, 13న వేపగుంట, ఉత్తరపుకండ్రిగ, 16న పరమేశ్వరమంగళం, 17న తిరుమలకుప్పం, 18న కేబీఆర్‌పురం, 19న పుత్తూరు, 20, చెర్లోపల్లి, 21న ఈశ్వరాపురం, 23 కేఎంఅగ్రహారం, గొల్లపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలలంలో 10వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు గురువారం తహసీల్దార్ అరుణకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు షెడ్యూలు ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. 10వ తేదీ క్రిష్టజమ్మపురం పంచాయతీలో రెవెన్యూ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్

- చింతలపట్టెడ నుంచి వసూళ్లు ప్రారంభం
- పన్ను చెల్లింపును బాధ్యతగా స్వీకరించండి
- మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి


పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: పేరుకుపోయిన పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్‌ను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఉన్న మున్సిపల్ పన్ను వసూలు సమస్యను పరిష్కరించేందుకు నడుం బిగించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సిబ్బందితో పాటు వెళ్లి బకాయిలు చెల్లించాల్సిన వారి ఇళ్ల వద్దకే వెళ్లి అవగాహన కల్పించి పన్ను వసూలు చేసే ప్రక్రియను శుక్రవారం నుంచి ప్రారంభించారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి పన్ను వసూళ్లలో చివరిస్థానంలోనే స్థిరపడిపోయిన నగరి మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించి 14671 అసెస్‌మెంట్‌లు ఉండగా వాటి ద్వారా ప్రస్తుత ఏడాదికి రావాల్సిన పన్ను రూ.3.16 కోట్లు, నీటి పన్నుకు సంబంధించి 5723 అసెస్‌మెంట్లు ఉండగా వాటి ద్వారా రావాల్సిన పన్ను రూ.68.58 లక్షలు అంటే ఏడాదికి పన్నుల ద్వారా రూ.3.84 కోట్లు రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు వసూలైన ఆస్తి పన్ను రూ.1.60 కోట్లు కాగా, నీటి పన్ను రూ.15.65 లక్షలు మాత్రమే. ఈ ఏడాదికి పన్నుల ద్వారా ఇంకా వసూలు కావాల్సిన బకాయిలు రూ.2.08 కోట్లు ఉంది. ఇలా మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి పేరుకు పోయిన బకాయిలు రూ.2.59 కోట్లు ఉంది. ఈ లెక్కన మున్సిపాలిటీకి ఉన్న పన్ను బకాయిలు రూ.4.68 కోట్లు ఉంది. ఇలా పన్నులు సకాలంలో వసూలు కాకపోవడంతో సాధారణ నిధుల లోటు ఏర్పడి మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. 2005వ సంవత్సరం మే 28వ తేదీన నగరి, కొత్తపేట, కీళపట్టు, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట, సత్రవాడ, చింతలపట్టెడ, నగరిపేట, టీఆర్.కండ్రిగ, కరకంతాపురం, నెత్తం కండ్రిగ, కాకవేడు పంచాయతీలు కలిసి నగరి మున్సిపాలిటీ ఆవిర్భవించింది. 2005–06 ఏడాది పంచాయతీ పన్నునే కొనసాగించిన అధికారులు 2006–07న మున్సిపల్ నిబంధనల ప్రకారం చదరపు అడుగుల లెక్కన పన్ను లెక్కించే ప్రక్రియను ప్రారంభించారు. నగరి పంచాయతీ స్థాయి నుంచి మున్సిపల్ స్థాయికి ఎదగడంతో పన్ను విధింపు కూడా పెరిగింది. పెరిగిన పన్ను మున్సిపల్ ప్రజలను ఆగ్రహానికి లోనయ్యేలా చెయ్యడంతో మున్సిపాలిటీ వద్దు రద్దు చెయ్యండన్న నినాదాన్ని ప్రజల్లో తెచ్చింది. అది కాస్త రాజకీయ రంగు పులుముకోవడంతో ప్రజలు పన్ను కట్టకుండా భీష్మించుకున్నారు. ఆపై పలు ప్రభుత్వాలు మారడం, కమిషనర్లు మారడం ప్రజల్లో అవగాహన తేవడానికి ప్రయత్నించారు. బకాయిదారులకు నోటీసులు ఇవ్వడం, బకాయిలకు వేసే వడ్డీలో రాయితీలు ఇవ్వడం, మరోవైపు ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పన్ను చెల్లింపు తప్పనిసరి చేశారు. దీంతో పన్నుల వసూళ్లలో కొంతమేరకు మార్పు వచ్చినా పూర్తి స్థాయిలో పని చేయలేదు. ఒకవైపు మొండి బకాయిదారులకు మాత్రం పన్ను పేరుకుపోయి వడ్డీలతో కలిసి తడిసి మోపెడైంది. ఈ పన్నుల వసూలుకు కొత్త పద్ధతులను అధికారులు పాటిస్తూనే ఉన్నారు. ఇవి ప్రజల్లో మార్పు తెస్తే పూర్తిస్థాయిలో పన్నులు వసూలు అవుతుంది. మున్సిపల్ సాధారణ నిధులు బలోపేతమై పలురకాల అభివృద్ధి పనులు చేసేందుకు వీలుంటుంది.

సిమెంట్ రోడ్డుపై నీరు కదలదు



విజయపురం: మండలంలోని గంగమాంబపురంలో సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. మురికి కాలువ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లడానికి వీలులేదు. దీంతో వర్షం పడిన ప్రతి సారి ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నారులు, వృద్ధులు సైతం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

నీవానదిపై గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని నీవానది వంతెనపై గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏర్పడ్డ భారీ గుంతలను ఎట్టకేలకు పూడ్చారు. మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘ప్రయాణం నరకప్రాయం’ వార్తకు స్పందించిన మండలంలోని నాయకులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వెంటనే నీవా నది వంతెనపై గుంతలు పూడ్చివేయాలని ఆదేశాలిచ్చారు. మండల టీడీపీ నాయకులు గురువారం సాయంత్రం నీవా నది వంతెనపై గుంతలకు మట్టి పోసి తాత్కాలికంగా ప్రయాణికులకు ఉపశమనం కలిగించారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి, మాజీ జెడ్పీటీసీ వెంకటేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.


గుంతలు పూడ్చివేస్తున్న దృశ్యం

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు



దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు, విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు

నగరి: వైకల్యం శరీరానికే ఉంటుంది కానీ మనసుకు ఉండదని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నగరి మండలం భవిత కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినీవిద్యార్థులకు డ్రాయింగ్, ఆర్ట్ మొదలగు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించవచ్చన్నారు. స్టీఫెన్ హాకింగ్, నిఖిల్ బోజస్, లూయి బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ తదితరులు దీనికి ఉదాహరణగా నిలిచారన్నారు. దివ్యాంగులు అయినప్పటికీ తమదైన ముద్రను లోకానికి చూపారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి–2 నమశ్శివాయం మాట్లాడుతూ భవిత కేంద్రం ఇస్తున్న 11 రకాల సేవలను వాటి వివరించి తల్లిదండ్రులు ఈ సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాత వత్సల ఆక్సిజన్ కోసం ట్రంప్ పోలింగ్ కొనుగోలుకు రూ.12 వేలు విరాళంగా అందించారు. అలాగే టీచర్ సంగీత రూ.1,500 విలువైన కీలు గుర్రం బొమ్మ బహుమతిగా ఇచ్చారు, మరో ఉపాధ్యాయిని సంపూర్ణ భోజనాలు ఏర్పాటు చేశారు, ఉపాధ్యాయులు శ్రీదేవి, హేమలత చెరో రూ.1000 విరాళంగా అందించగా, మునస్వామి స్వీట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతి, భవిత కేంద్ర ఉపాధ్యాయులు భవాని, సంతోష్ నాయక్, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

నిండ్ర: దివ్యాంగులని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎంపీపీ దీప అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో దివ్యాంగుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుండి పిల్లలు అలవాటు పడే విధంగా చిన్న చిన్న క్రీడలు, పోటీ క్విజ్‌లు నేర్పాలన్నారు. మండలంలోని భవిత కేంద్రంలోని పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించారు. వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, ఎంఈఓలు వసుమతిదేవి, శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు వేంకటేశులు వాసు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలి

కార్వేటినగరం: ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు విధిగా గుర్తించాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో జరుగుతున్న సేవలను ప్రత్యేకంగా గుర్తించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ–2 మాట్లాడుతూ దివ్యాంగులకు సరైన పద్ధతిలో సౌకర్యాలు కల్పిస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం ఎంఈఓల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు సింధూజ, సుమతి, ధనుంజయుడు, యశోద, సీఆర్పీలు మీనా, కార్తీక్ రాయన్, గణేష్ పలువురు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను వినియోగించుకోండి

గంగాధరనెల్లూరు: దివ్యాంగులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి వైపు అడుగులు వేయాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త జయప్రకాష్ నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహిస్తే ప్రతిభాపాటవాల కొదవలేదన్నారు. భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అందజేసే సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఆటల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని రెడ్డమ్మ, అక్కన్నగారిపల్లి ప్రధానోపాధ్యాయుడు గంగాధరం, సహిత విద్య ఉపాధ్యాయులు వరదారెడ్డి, పుష్పావతి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ నిరంజన్ రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహా కుంభాభిషేకం



స్వామి, అమ్మవార్లు, పుష్పపల్లకిపై స్వామి, అమ్మవార్లు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కన్నికాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ, రాధారుక్మిణి ఆలయ మహా కుంబాభిషేకం గురువారం వైభవంగా ముగిసింది. ఉదయం వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం యాగశాల పూజలు నిర్వహించారు. 11.15 గంటలకు మహా కుంబాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ స్వామివారి చిత్రపటాన్ని సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పుష్పపల్లకిపై స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ ఆవరణలో వీధినాట్యం చేపట్టారు.

కబడ్డీ విజేత నెల్లేపల్లి


కబడ్డీ పోటీలలో గెలుపొందిన జట్లు

గంగాధరనెల్లూరు: నియోజకవర్గస్థాయి కబడ్డీ పోటీలలో సీనియర్ బాలికల జట్టు, బాలుర జట్టు విజయం సాధించినట్టు నెల్లేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుబ్బరత్నమ్మ తెలిపారు. తూగుండ్రం హైస్కూల్ మైదానంలో గత వారం రోజులుగా జరుగుతున్న నియోజకవర్గ స్థాయి పోటీలలో నెల్లేపల్లి పాఠశాలకు చెందిన బాలుర జట్టు, బాలికల జట్టు మొదటి స్థానం కైవసం చేసుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం యుగంధర్ ఆచారి, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మయ్య, రజిని అభినందించారు.